ఎండైనా వానైనా.. ఆరుబయటే నిరీక్షణ

- బస్టాపులు లేక ఇబ్బంది పడుతున్న పాతనగరవాసులు
- ఉన్న అరకొర స్టాపులను దుకాణాలుగా మార్చేసుకున్న వ్యాపారులు
- నిలువ నీడ కల్పించాలని ప్రయాణికుల వేడుకోలు

చారిత్రక ప్రాశస్త్యం కలిగిన పాతనగరం ఒకప్పుడు గొప్ప ప్రభతో వెలుగొందింది. విశాఖ సిటీగా రూపొందక ముందు వన్‌టౌన్‌గా పిలవబడే జగదాంబ, యల్లమ్మతోట, మహారాణిపేట, అల్లిపురం, వెలంపేట, కన్వేయర్ బెల్ట్ ఏరియా వంటి అనేక ప్రాంతాలు కళకళలాడేవి. అయితే తర్వాతి కాలంలో నగరం విస్తరించడంతో వన్‌టౌన్ పాతనగరంగా పిలవబడుతూ ప్రాధాన్యత కోల్పోయింది. చాలా ఏళ్లు ఈ ప్రాంతం ఇలాగే కొనసాగింది. ఇరుకు రోడ్లు, అధిక జనసాంద్రత, మురికివాడలు, లోపభూయిష్టమైన డ్రైనేజీ వ్యవస్థ, శిథిలమైన బ్రిటిష్ కాలం నాటి కట్టడాలతో అభివృద్ధికి ఆమడదూరంలో ఉండేది.



జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో జగదాంబ థియేటర్ వద్ద నిర్మించిన అత్యాధునిక బస్‌బే

జగదాంబ: అభివృద్ధికి ఆమడ దూరంగా ఉన్న వన్‌టౌన్ ప్రాంతంలో జగనన్న ప్రభుత్వం వచ్చాక మార్పు చోటు చేసుకుంది. ఇక్కడ ఒకప్పుడు గొప్ప ఖ్యాతి గడించిన ఇందిరా మున్సిపల్ స్టేడియంలో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు ఎన్నో జరిగాయి. తర్వాతి కాలంలో ఈ స్టేడియం మూలనపడింది. దీనిని ఏ ప్రభుత్వాలు పట్టించుకోలేదు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలోనే ఈ స్టేడియం అభివృద్ధికి నడుం బిగించారు. అలాగే వన్‌టౌన్‌లో శిథిలమైన రహదారుల నిర్మాణం. జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ వరకు ప్రధాన రహదారి నిర్మాణం వంటి పనులు మొదలయ్యాయి. అలాగే పురాతనమైన పాతనగరంలో అనేక చోట్ల బస్టాప్‌లు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. కొన్ని పూర్తి చేశారు. ముఖ్యంగా జగదాంబ థియేటర్ వద్ద అత్యాధునిక పద్ధతిలో నిర్మించిన బస్‌బే ఎంతో ఆకర్షణీయంగా రూపొందింది. ఇదే తరహాలో పాతనగరంలో బస్టాప్‌లు లేని చోటల్లా బస్‌బేలు నిర్మించాలని జగన్ ప్రభుత్వం తలపోసింది. అయితే ఎన్నికల్లో ఓటమితో అది నెరవేరలేదు. దీంతో పాతనగరంలోని పలు ప్రాంతాల్లో బస్ షెల్టర్ల నిర్మాణం జరగలేదు. ఉన్న కొన్ని బస్ షెల్టర్లు ప్రయాణికులకు అనువుగా లేకుండా పోయాయి.

బస్టాపుల్లోనే దుకాణాలు..

పూర్ణామార్కెట్ జంక్షన్‌లో ఉన్న బస్టాప్‌ను కొందరు వ్యాపారులు సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు. బస్టాప్‌లోనే తమ వ్యాపార సామగ్రి డంప్ చేసి ప్రయాణికులకు నిలువ నీడ లేకుండా చేస్తున్నారు. ఆటో డ్రైవర్లు కూడా ఈ బస్టాప్‌ల్లో బస్సులకు అడ్డంగా ఆటోలు నిలబెట్టి బేరాలు చూసుకుంటున్నారు. ఇటువంటి చర్యలకు అడ్డుకట్ట వేయాలని, బస్టాప్‌ల్లో దుకాణాలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


పాతబస్టాండ్ ప్రాంతంలో బస్సు నీడే బస్టాపుగా వేచి ఉన్న ప్రయాణికులు

బస్సు ఎక్కేందుకైనా చోటివ్వరు..

దక్షిణ నియోజకవర్గంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆటోలదే ఇష్టారాజ్యం. ఇక్కడ కనీసం ఆర్టీసీ బస్సులకు కూడా దారి లేకుండా ఆటో డ్రైవర్లు మొత్తం రహదారిని ఆక్రమించుకుంటారు. దీనివల్ల పాత బస్టాండ్ నుంచి వచ్చే బస్సులు ఆగేందుకు.. ప్రయాణికులు ఎక్కేందుకు వీలు కాని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ విషయంలో ఆర్టీసీ లైన్ ఇన్‌స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పేరు పాతబస్టాండ్.. ఇక్కడ బస్ షెల్టరే లేదు..

నగరంలోని చాలా బస్ సర్వీసులు ఎక్కడి నుంచి ఎక్కడికి తిరిగినా వాటి చివరి మజిలీ మాత్రం పాతబస్టాండే. ఇక్కడే డ్రైవర్లు, కండక్టర్లు సేదదీరడం, టీ తాగుతూ అలసటను దూరం చేసుకోవడం మనం గమనించవచ్చు. ఇక్కడి నుంచి ప్రయాణికులు కూడా పెద్ద ఎత్తున నగరంలోని వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. విచిత్రం ఏమిటంటే.. పాతబస్టాండ్ పేరులో బస్టాండ్ అయితే ఉంది కానీ ఇప్పటి వరకు ఇక్కడ బస్టాండ్ లేకపోవడం విడ్డూరమని ప్రయాణికులంటారు. ఎండాకాలం.. వర్షాల సమయంలో బస్సుల కోసం నిరీక్షించాలంటే ఇబ్బందిగా ఉందని వారు చెబుతున్నారు.


వన్‌టౌన్‌లో ఎండలోనే బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

బస్టాపుల్లో వ్యాపారాలొద్దు..



మాది ఆనందపురం. పూర్ణామార్కెట్‌కు రావాలంటే కనీసం 30 కిలోమీటర్లు ప్రయాణించాలి. ఇంత కష్టపడి వన్‌టౌన్‌కు వస్తే తిరిగి వెళ్లేటప్పుడు సరైన సౌకర్యాలు లేవు. ఇక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలన్నా బస్టాపులు లేవు. ఉన్న కొన్ని బస్ షెల్టర్లలో వ్యాపారులు చక్కగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. ప్రయాణికులను బస్టాప్‌లో నిల్చోనివ్వడం లేదు.

–సత్యనారాయణ రాజు, ప్రయాణికుడు, ఆనందపురం

బస్టాప్ ఏర్పాటు చేయాలి..



పాతనగరంలో కచ్చితంగా బస్టాప్ ఏర్పాటు చేయాలి. ఇక్కడికి నగరం నుంచి ఎన్నో బస్సులు వస్తుంటాయి. అలాగే ఇక్కడి నుంచి అన్ని ప్రాంతాలకు ప్రయాణికులు వెళ్తుంటారు. కానీ ప్రయాణికుల కోసం ఇక్కడ ఒక్క బస్టాప్ కూడా లేకపోవడం విచారకరం. ప్రభుత్వం స్పందించి వెంటనే పాత బస్టాండ్‌లో బస్టాప్ ఏర్పాటు చేయాలి.

–గోవింద్, పాతనగరవాసి

క్లుప్తంగా

రైతు ఉత్పత్తిదారు సంఘాలకు ప్రోత్సాహం

మహారాణిపేట: రైతు ఉత్పత్తిదారు సంఘాల (ఎఫ్‌పీవో–ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్)కు తగిన విధంగా ప్రోత్సాహం అందించాలని, ప్రొడక్ట్స్‌కు సరైన మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర పథకాల తాలూకా ఫలాలను రైతులకు చేరువయ్యేలా అధికారులు కృషి చేయాలని నిర్దేశించారు. స్థానిక కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఎఫ్‌పీవో డిస్ట్రిక్ట్ లెవల్ మానిటరింగ్ కమిటీ సమావేశం మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లాలోని వివిధ రైతు ఉత్పత్తిదారు సంఘాల ప్రతినిధులతో పలు అంశాలపై చర్చించారు. రైతులు పండించే పంటలు, వాటి మార్కెటింగ్ అవకాశాలు, స్టోరేజ్ పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారు సంఘాలకు అన్ని విధాలుగా సహకారం అందించాలని, వారికి ఆర్థిక ప్రయోజనాలు కలిగే విధంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. అలాగే రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర వచ్చేలా.. అధిక లాభాలు పొందే విధంగా రైతు ఉత్పత్తిదారు సంఘాలు కృషి చేయాలన్నారు. సమావేశంలో నాబార్డ్ డెవలప్‌మెంట్ మేనేజర్ బసంత్ కుమార్, ఎల్డీఎం శ్రీనివాసరావు, వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖల అధికారులు, డీఆర్డీఏ పీడీ శోభారాణి, ఉత్పత్తిదారు సంఘాలకు చెందిన ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

డాబాగార్డెన్స్: మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధి జగదాంబ జంక్షన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండగా స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. దాంతో పోలీసులు వచ్చి 108లో కేజీహెచ్‌కి ఆ వ్యక్తిని తరలించారు. ఆ వ్యక్తి అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి సుమారు 73 సంవత్సరాలు ఉంటాయని, మాసిపోయిన గెడ్డంతో ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు 0891–274866, 9440796010 నంబర్లకు తెలియజేయాలని పేర్కొన్నారు.

కంచర్లకు సినారె పురస్కారం


కంచర్లకు సినారె పురస్కారం అందజేస్తున్న గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, జీవీఎల్ నరసింహారావు

డాబాగార్డెన్స్: విశేష సేవలందిస్తున్న కంచర్ల అచ్యుతరావుకు సినారె ఆత్మీయ పురస్కారం అందజేయడం హర్షణీయమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డి 94వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆత్రేయ స్మారక కళా పీఠం ఉపకార్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కంచర్ల అచ్యుతరావును ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ తమ సాహిత్యం ద్వారా తెలుగు పాటకు జీవం పోసిన మహనీయులు ఆత్రేయ, సినారె అని కొనియాడారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, మాజీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ విశ్వ వ్యాప్తంగా ఖ్యాతిగాంచిన గాయకులతో పాడించి ఆకట్టుకోవడంలో నిర్వాహకుల కృషిని అభినందించారు. పురస్కార గ్రహీత కంచర్ల మాట్లాడుతూ సినారె పేరిట అవార్డు లభించడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. అనంతరం సినారె విరచిత గీతాలను గాయనీ గాయకులు ఆలపించారు. కార్యక్రమంలో పీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళి, పైడా కృష్ణప్రసాద్, సూరపనేని విజయ్‌కుమార్, గ్రంధి విష్ణు, ఉసిరికల చంద్రశేఖర్, చెన్నా తిరుమలరావు, శోభన్ ప్రకాష్, ఎస్ఎస్ఎన్ రాజు, ఉమామహేష్, లక్ష్మీ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఆదుకుంటూ.. ఆదరణ చూపుతూ..

నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలకు అండగా వాసుపల్లి

డాబాగార్డెన్స్: పదేళ్ల పాటు ఎమ్మెల్యేగా కొనసాగారు. నిత్యం ప్రజల్లోనే ఉన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఏ సమస్య వచ్చినా.. మీ సమస్యకు పరిష్కారం నాదంటూ ప్రజల పక్షానే నిలిచారు. వారంలో మంగళ, శుక్రవారాల్లో నియోజకవర్గ పరిధి పలు ప్రాంతాల్లో ప్రజాదర్బార్‌లు నిర్వహించి అక్కడికక్కడే సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేవారు. అతనే విశాఖ దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్. ఎన్నికల ముందే కాదు.. ఎన్నికల తర్వాత.. ఓటమి అనంతరం కూడా తన సేవలు కొనసాగిస్తూ ఔరా అనిపించుకుంటున్నారు. ఇప్పటి వరకు ఎంతో మంది వాసుపల్లి సేవలు పొందారు.

ప్రజల పక్షానే వైఎస్సార్‌సీపీ..

దక్షిణ నియోజకవర్గ పరిధి 38వ వార్డుకు చెందిన చిన్ని కృష్ణ అనారోగ్యంతో మంచం పట్టాడు. ఈ విషయం పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న వాసుపల్లి గణేష్ కుమార్ మంగళవారం నేరుగా వారింటికి వెళ్లి చిన్ని కృష్ణను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నట్టు తెలుసుకుని రూ.5 వేలు ఆర్థిక సాయం తన సొంత నిధుల నుంచి అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజలు, పేదల పక్షాన నిలబడి పోరాటాలు చేసి ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ ఆదుకుంటుందన్నారు. తాను అధికారంలో ఉన్నా, లేకున్నా ఎల్లప్పుడూ దక్షిణ నియోజకవర్గ ప్రజలను ఆదుకుంటూ సహాయ సహకారాలు అందిస్తానన్నారు.


చిన్ని కృష్ణను పరామర్శిస్తున్న వాసుపల్లి

సమర్థవంతంగా చట్టాలు అమలు చేయాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ లీగల్ : చిన్నారులు, మహిళల అక్రమ రవాణా విషయంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ సూచించారు. వారి రక్షణకు ఉద్దేశించిన చట్టాలు సమర్థంగా అమలు చేసేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక న్యాయ సేవా సదన్‌లో మంగళవారం ఉదయం జువైనల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ, రక్షణ) చట్టంపై ప్రత్యేక జువైనల్ పోలీస్ యూనిట్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో చిన్నారుల అక్రమ రవాణా, మాయం కావడం వంటి కేసులు సమాజాన్ని కలవరపెడుతున్నాయన్నారు. అదేవిధంగా యాసిడ్ దాడులకు గురైన మహిళల రక్షణకు ప్రభుత్వం కల్పించిన చట్టాలు సమర్థంగా అమలు పరచాలని కోరారు. అందరూ చట్టాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఒకటో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ, రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి సి.కె. గాయత్రి దేవి, ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ ఎస్.వరలక్ష్మి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, చిత్రంలో పలువురు న్యాయమూర్తులు

పూర్ణామార్కెట్ ఆశీలు వేలం రూ. 52.50 లక్షలు

జగదాంబ: ఎట్టకేలకు పూర్ణామార్కెట్ ఆశీలు పాట వేలం ఖరారైంది. వాస్తవానికి ఈ ఏడాది మార్చిలో వేలం పాట నిర్వహించి ఏప్రిల్ మొదటి తారీఖున కాంట్రాక్టర్‌కు అప్పగించాల్సి ఉంది. అయితే ఎన్నికల నేపథ్యంలో పాట వాయిదా పడింది. తర్వాత నెలలు తగ్గించి పాట పెట్టినప్పటికీ కాంట్రాక్టర్లు కార్పొరేషన్ నిర్ణయించిన ధర ఎక్కువగా ఉందంటూ ముందుకు రాలేదు. దీంతో నాలుగు నుంచి అయిదు సార్లు పాట వాయిదా వేస్తూ వచ్చారు. మంగళవారం జరిగిన వేలంలో ఇండిపెండెంట్ కార్పొరేటర్ కాంట్రాక్టర్లను పంపించి పాట దక్కించుకున్నట్లు తెలిసింది. అయితే వేలం పాట ఎవరు పాడినప్పటికీ జీవీఎంసీకి కట్టాల్సిన బిడ్‌తో పాటు పాట పాడిన మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుత పాట రూ. 52.50 లక్షలని తెలుస్తోంది. ఇదిలా ఉండగా జీవీఎంసీ కమిషనర్ మొదటిసారి పాతనగరంలోని 35వ వార్డులో పర్యటించారు. ఈ పర్యటనలో వార్డుకు చెందిన ఇండిపెండెంట్ కార్పొరేటర్ కమిషనర్‌తో కలిసి వార్డులో హడావిడి చేసి అందరి దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

సీతమ్మధార: పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ మంగళవారం వినతిపత్రం అందించారు. ఆశీలమెట్టలోని ఒక హోటల్లో జరుగుతున్న సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ 1265 రోజుల నుంచి స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించరాదని ఆందోళన చేస్తున్నామని, ఎన్నికల సందర్భంగా నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్టీల్ ప్లాంట్‌ను రక్షిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఉక్కుకు కావాల్సిన రూ. 5 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం గ్రాంట్‌గా మంజూరు చేయాలన్నారు. వేతన జీవోలు సవరించాలని, విశాఖ లేబర్ కోర్టులో జడ్జిలను, జాయింట్ లేబర్ కమిషనర్‌ను నియమించాలన్నారు. కార్మికులకు నష్టం చేకూర్చే కోడ్స్ రద్దు, మోటారు ట్రాన్స్‌పోర్టు చట్టం 2019 రద్దు వంటి వాటిలో జోక్యం చేసుకోవాలన్నారు. మున్సిపల్, ఆశ, అంగన్‌వాడీ, సమగ్ర శిక్షా అభియాన్ కార్మికులకు సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ పబ్లిక్ సెక్టార్ కో–ఆర్డినేషన్ కమిటీ కో–కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేవమాత ఉత్సవాలకు ఏర్పాట్లు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ మంగళవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పర్యటించారు. ఆగస్టు 1 నుంచి జరగనున్న దేవమాత తేరు ఉత్సవాలకు గోతులు, రహదారులు పూడ్చాలని, వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ముందుగా బాబుకాలనీ, సెబాస్టియన్‌కాలనీ, జేఎస్ఎస్‌యూఆర్ఎం కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు పలు సమస్యలపై కార్పొరేటర్ పూర్ణిమకు వినతి పత్రాలు అందజేశారు. జీవీఎంసీ కమిషనర్ దృష్టికి వాటిని తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, వేళంగిణిరావు, సచివాలయ సిబ్బంది సతీష్, ప్రభు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేర చెత్త తరలించాలి


చెత్త తరలింపును పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్

జగదాంబ: నిబంధనల ప్రకారం ప్రతి క్లాప్ వాహనం చెత్తను యార్డుకు తరలించాలని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో రాజేష్ అన్నారు. మంగళవారం ఆయన జోన్ పరిధిలో వార్డుల్లో పర్యటించారు. చెత్త సేకరణలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు వాహనాలు వెళ్లలేని వీధుల్లోకి సిబ్బంది వెళ్లాలన్నారు. అనంతరం ఆయన ప్రజలతో మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం కాలువలు, గెడ్డలు, రహదారులు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత ఇన్‌స్పెక్టర్, సెక్రటరీలకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తండ్రి చెంతకు కుమార్తె


చాంతినీకుమారిని తండ్రికి అప్పగిస్తున్న వాసు

డాబాగార్డెన్స్ : వారం రోజుల కిందట విశాఖ రైల్వే స్టేషన్ ప్రీపెయిడ్ ఆటో స్టాండ్ వద్ద వర్షంలో తడుస్తూ చాందినీకుమారి, ఆమె కుమారుడు ఆయుష్‌కుమార్‌ను ట్రాఫిక్ కానిస్టేబుల్ చూసి ఏయూటీడీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించి టీఎ స్సార్ మహిళా షెల్టర్‌కు తరలించి ఆశ్రయం కల్పించారు. వివరాలు అడిగితే భర్త వదిలేశాడని, పని కోసం వచ్చానని, ఊరు కుసుంద, ధన్‌బాద్ సిటీ, జార్ఖండ్ రాష్ట్రమని చెప్పింది. కుటుంబ సభ్యుల సమాచారం కోసం రాంచీలో ఉంటున్న లాఖీదాస్‌ను సహాయం అడిగితే, వెంటనే వాళ్ల టీంను పంపి బాధితురాలి తల్లిదండ్రులను కలిసి ఫోన్‌లో మాట్లాడించారని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. తండ్రి సుదామాదాస్ వెంటనే విశాఖకు వచ్చి తన అల్లుడు తన కూతుర్ని వదిలేసి వేరే పెళ్లి చేసుకోవడంతో అప్పటి నుంచి కూతురి మానసిక ఆరోగ్యం పాడైందని, రాంచీ ఆస్పత్రిలో జాయిన్ చేశామని తెలిపారన్నారు. కూతుర్ని జాగ్రత్తగా అప్పగించినందుకు ప్రగడ వాసుకు కృతజ్ఞతలు తెలిపారు.

తిరుపతిలో వెలమలకు ఓ కాటేజీ


సమావేశమైన వెలమ సంఘం ప్రతినిధులు

డాబాగార్డెన్స్: వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం తిరుమల వెళ్లే వెలమ కుల భక్తుల సౌకర్యార్థం వెలమ సంఘ నేతలు తిరుపతిలో వసతి నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే నిర్మించిన శ్రీశైలం, కాశీ పుణ్యక్షేత్రాల్లోని కాటేజీల తరహాలో తిరుపతిలో కూడా భవనాలు నిర్మించాలని ఆల్ వెలమ సంక్షేమ సంఘం ప్రతిపాదించింది. రాష్ట్రం నలుమూలల నుంచి పలువురు సంఘ ప్రతినిధులు విశాఖ కేంద్ర సంఘం కార్యాలయంలో సమావేశమై ఈ మేరకు తీర్మానించారు. తిరుపతి నుంచి వచ్చిన కర్రి సతీష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతి భవనాల నిర్మాణానికి అవసరమైన స్థల, నిధుల సేకరణకు రాష్ట్రంలోని వెలమ జాతీయులందర్నీ కలిసి సలహాలు, సూచనలు సేకరిస్తామన్నారు. వెలమ సెంట్రల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చుక్క చినబాబు మాట్లాడుతూ సామాజికంగా, రాజకీయంగా వెలమలంతా ఐకమత్యంతో ఒక్కటై పయణించాలని పిలుపునిచ్చారు. ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి బండారు రామకృష్ణ, ఆల్ వెలమ సమన్వయకర్త అల్లు శంకరరావు, గూనూరు వెంకట రమేష్, సిరికి పోతురాజు, సింగంపల్లి రామారావు, కింజరాపు సూర్యనారాయణ, మరడాన శేషగిరిరావు, రంభ బుజ్జి, జి.లక్ష్మణ, గునుపూరు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పంపిణీ విధానం పక్కాగా అమలు కావాలి

మహారాణిపేట : జిల్లాలో అమలవుతున్న నూతన ఉచిత ఇసుక పంపిణీ విధానం పక్కాగా అమలు కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలో పలువురు అధికారులతో కలిసి ఆయన ఇసుక డిపోలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నూతన ఉచిత ఇసుక సరఫరా విధానాన్ని అమలు చేస్తోందన్నారు. జిల్లాలో సజావుగా, సులభతరంగా ఇసుక పంపిణీ విధానం అమలు కావాలని సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సరఫరాలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్నారు. ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టి, స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక ధరలను పారదర్శకంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్, గనుల శాఖ ఉప సంచాలకులు డీఈఎంఎస్ ఎస్ఎన్.రాజు, గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ఇసుక డిపో వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

లింగ నిర్ధారణకు పాల్పడితే చర్యలు


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు. చిత్రంలో సివిల్ జడ్జి వెంకట శేషమ్మ తదితరులు

మహారాణిపేట: జిల్లాలో ఉన్న అన్ని స్కానింగ్ సెంటర్లు వాటి వివరాలు తమ కార్యాలయంలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి. జగదీశ్వరరావు తెలిపారు. రేసవానిపాలెంలోని తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులకు మహిళల హక్కుల పరిరక్షణ, లింగ వివక్షపై లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అల్ట్రాసౌండ్ స్కానింగ్‌పై లీగల్ అవేర్ నెస్ ప్రోగ్రాం గురించి వివరించారు. లింగ నిర్ధారణ చేయరాదని, ప్రతి స్కానింగ్ సెంటర్‌లో గైనకాలజిస్ట్ గాని, రేడియాలజిస్ట్ గానీ స్కాన్ చేయాలన్నారు. ఇంగ్లీష్‌తో పాటు ప్రాంతీయ భాషలో సైనేజ్ బోర్డ్స్ ప్రదర్శించాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఎం. వెంకట శేషమ్మ మాట్లాడుతూ ఆస్పత్రుల్లో లింగ నిర్ధారణ చేయరాదన్నారు. అలా చేస్తే 5 సంవత్సరాల జైలు శిక్ష, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ రద్దు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ పూర్ణేంద్రబాబు, నోడల్ అధికారులు డాక్టర్ బి.ఉమావతి, ఐ.మనోరమ, డాక్టర్ సమత తదితరులు పాల్గొన్నారు.

తనికెళ్ల భరణికి 'రంగసాయి జీవన సాఫల్య పురస్కారం'

డాబాగార్డెన్స్: నాటకరంగ ప్రోత్సాహమే లక్ష్యంగా 2010లో ప్రారంభమైన రంగసాయి నాటక సంఘం వార్షికోత్సవం ఆగస్టు 1న నిర్వహించనున్నట్లు బాదంగీర్ సాయి తెలిపారు. ఈ మేరకు మంగళవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో వార్షికోత్సవ కార్యక్రమ వివరాలు వెల్లడించారు. ఆగస్టు ఒకటిన కళాభారతి ఆడిటోరియం వేదికగా సాయంత్రం 6 గంటల నుంచి వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్టు చెప్పారు. వెండి తెరకే ఆభరణంగా వెలుగొందుతున్న రంగస్థల నటుడు, రచయిత, దర్శకుడు తనికెళ్ల భరణికి 'రంగసాయి జీవన సాఫల్య పురస్కారం' అందజేయనున్నట్టు చెప్పారు. అలాగే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న రంగస్థల ప్రముఖుల్లో మరో ఐదుగుర్ని ఎంపిక చేసి రంగసాయి థియేటర్ అవార్డు ఈ ఏడాది నుంచి ఇవ్వనున్నట్లు తెలిపారు. పదేళ్ల లోపు బాలబాలికలచే 'సంక్షిప్త భారతం' అనే పౌరాణిక ఏకపాత్రాభినయం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎన్. నాగేశ్వరరావు, శివజ్యోతి, రవిబ్రహ్మ, నవరస మూర్తి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమ వివరాలు వెల్లడిస్తున్న బాదంగీర్ సాయి